# సిల్లీ ఫెలో

మల్లిక్

సమయం...

సాయంత్రం నాలుగు గంటలు! అదొక గవర్నమెంటు ఆఫీసు. గవర్నమెంటు ఆఫీసు ఎలా వుంటుందో ఆ ఆఫీసు కూడా ఎంచక్కా అలాగే వుంది.

కారిడార్స్‌లో గోడలమీద కిళ్ళీ ఉమ్ముల డిజైన్లతో, అక్కడక్కడావున్న టాయిలెట్స్ వాసనల ఘుమఘుమలతో గదుల్లో పెయింట్స్ పోయిన అలమారాలతో, కాళ్ళు ఊగే టేబుల్స్‌తో, ఆ టేబుల్స్‌మీద నలిగిన కాగితాలున్న దుమ్ము కొట్టుకుపోయిన ఫైల్స్‌తో, సీట్లలో ఏ ఎక్స్‌ప్రెషన్ లేని మొహాలేస్కుని కూర్చున్న మనషుల్తో చాలా కళకళలాడ్తుంది ఆ ఆఫీసు.

బుచ్చిబాబు ఓసారి గోడ గడియారం వంక చూసి బుస్సున నిట్టూర్చాడు. అ తర్వాత తన సీట్లో అసహనంగా కదిలాడు.

అతని ప్రక్క సీట్లోని వెంకట్ బుచ్చిబాబు వంక చూశాడు.

"ఏం.. పనెక్కువుందా" ఆడిగాడు వెంకట్.

బుచ్చిబాబు తల అడ్డంగా ఊగించాడు.

"సిల్లీ.... పనెక్కువుంటే నేనేమైనా భయపడ్తానా?" అని సమాధానం చెప్పి ఫైల్లో తల దూర్చాడు.

ఓ నిమిషం గడిచింది.

మరోసారి గోడ గడియారం వంక చూసి బుస్సున నిట్టుర్చాడు బుచ్చిబాబు.

నాలుగు క్షణాలు గ్యాప్ ఇచ్చి 'చుపుక్' అని నోటితో శబ్దంచేసాడు. మరో ఎనిమిది క్షణాలు గ్యాప్ ఇచ్చి తల అడ్డంగా ఊపుతూ 'హా' అన్నాడు.

అతన్ని గమనిస్తున్న వెంకట్ ఊరికే ఉండలేకపోయాడు.

"ఏ క్యాహోల్ బన్‌రఖాహై తునే? ఏంటి నీ బాధా? పనెక్కువ లేదంటున్నావ్. మరెందుకు అంతగా హైరానా పడుతున్నావ్?" అని అడిగాడు.

"అంటే నాకు ఇంటికి త్వరగా వెళ్ళే పనుంది" నసిగాడు బుచ్చిబాబు.

"అలాగైతే ఊర్కె హైరాన పడ్డం ఎందుకు? బాస్‌ని పర్మిషన్ అడిగి వెళ్ళిపో" ఉచిత సలహా ఇచ్చాడు వెంకట్.

"ఏమో బాబు...... అర్థం కాని తిట్లు సిల్లీగా తిడ్తాడేమోనని నాభయం"

"ఎందుకు తిడ్తాడు? అయినా మనమేవైనా ఎప్పుడు పర్మిషన్లు అడుగుతుంటామా ఎప్పుడో అవసరమైనప్పుడు మాత్రమే అడుగుతాం గానీ... మరేం ఫరవాలేదు. వెళ్ళి ఆడుగు"

అని వెంకట్ ధైర్యం చెప్పాడు.

"పర్మిషన్ కోసం మనం చెప్పే కారణాలు మనకి రీజనబుల్‌గానే వుంటయ్‌గానీ బాస్‌కి మాత్రం అవి సిల్లీగా వుంటాయ్. అదే కదా బాధ" అంటూ సీటులోంచి లేచి భారమైన గుండెతో మేనేజర్ ఏకాంబరం క్యాబిన్‌లోకి అడుగు పెట్టాడు బుచ్చిబాబు.

ఏకాంబరం ఫైళ్ళలోకి తీవ్రంగా చూస్తున్నాడు. బుచ్చిబాబు మెల్లగా దగ్గాడు.

ఏకాంబరం తలెత్తి చూడలేదు. బుచ్చిబాబు మరికాస్త గట్టిగా దగ్గాడు.

ఏకాంబరం తలెత్తి చూశాడు.

"నువ్వా? ఒహటే దగ్గులు వినిపిస్తే నా క్యాబిన్‌లోకి ఎవరో క్షయరోగి వచ్చేశాడేమో అనుకున్నా" అన్నాడు బుచ్చిబాబు వంక సీరియస్ చూస్తూ.

"అంటే మీరు నన్ను చూళ్ళేదనీ..." నసిగాడు బుచ్చిబాబు బుర్ర గోక్కుంటూ.

"అందుకని అంత ఘోరంగా దగ్గాలా మరీనూ? సార్ అని పిలవొచ్చుకదా? ఏంటి విషయం?" కళ్ళెగురవేసాడు ఏకాంబరం.

"అంటే..అదీ...మరేమో..." బుచ్చిబాబు సందేహిస్తూ చెప్పేలోగా టైపిస్టు లత హడావిడిగా ఏకాంబరం క్యాబిన్‌లోకి వచ్చింది.

"ఏమ్మా? ఆ అర్జంట్ లెటర్ టైప్ చేసేశావా?" ఆమెని అడిగాడు ఏకాంబరం.

"చేసేశానండి"

లత తన చేతిలోని లెటర్‌ని ఏకాంబరం చేతికి అందించింది. లెటర్ ఆసాంతం చదివిన ఏకాంబరం లత వంక చూసి "కిల్లారి కిత్తి!" అన్నాడు.

వెంటనే లత కిలకిలానవ్వి మెలికలు తిరిగిపోతూ "థాంక్యూ సార్!" అంది.

"థాంక్సా? ఎందుకూ?"

"ఎందుకేంటి సార్... లెటర్ తప్పులు లేకుండా టైపు చేసానని నన్ను 'కిల్లారి కిత్తి' అని మెచ్చుకున్నారుగా?!" అమాయకంగా అడిగింది.

"అది మెచ్చుకోవడం కాదు. కిల్లారి కిత్తి అంటే తిట్టు. నువ్వు లెటర్ నిండా తప్పులు కొట్టావ్. దీన్ని మళ్ళీ టైప్ చెయ్"అంటూ లెటర్‌ని లత ముందుకి విసిరాడు ఏకాంబరం.

లత ఆ లెటర్ అందుకుని రెండడుగులు గుమ్మం వైపు వేసి మళ్ళీ వెనక్కి తిరిగి మేనేజర్ ఏకాంబరం వేపు చూసింది.

"సార్....కిల్లారి కిత్తి అంటే ఏంటి సార్?" భయం భయంగా అడిగింది లత.

"వద్దులేమ్మా... అర్థాలడక్కు! అది భయంకరమైన తిట్టు!" అన్నాడు ఏకాంబరం.

"ఫర్వాలేదు సార్. నేను తట్టుకుంటాను. చెప్పండి మీరు దాని అర్థం చెప్పకపోతే మళ్ళీ రాత్రంతా నాకు నిద్రపట్టదు. రాత్రంతా నిద్ర పట్టకపోతే మళ్ళీ రేపు శెలవు పెట్టాల్సి వస్తుంది"

"అమ్మో శలవా? వీల్లేదు! చెప్తా ఇలారా" అంటూ దగ్గరికి పిలిచాడు ఏకాంబరం.

లత బెదురు బెదురుగా ఏకాంబరం దగ్గరికి వెళ్ళింది.

“నీ చెవి ఇటు పారెయ్!” అన్నాడు ఏకాంబరం .

లత ముందుకు వంగింది.

“కిల్లారి కిత్తి అంటే...” అంటూ చెవిలో గుసగుసలాడ్తూ చెప్పాడు.

అతను చెప్పగానే లత మొహం కత్తివాటుకి నెత్తురు చుక్క లేనట్టుగా పాలిపోయింది. క్షణాల్లో ఆమెకి దు:ఖం పొంగుకొచ్చింది నోట్లో కొంగుదోపుకుని గుడ్ల నీరుకుక్కుకుని క్యాబిన్ లోంచి బయటికి రివ్వుమని పరుగుతీసింది.

బుచ్చిబాబు హతాశుడయ్యాడు.

లతకు అంత దుఃఖం తెప్పించిన ‘కిల్లారి కిత్తి’ అంటే ఏంటి?

ఏంటి? ఏంటి?? ఏంటీ???

సస్పెన్స్ భరించలేక మెల్లగా భయపడుతూనే ఏకాంబరాన్ని అడిగేశాడు బుచ్చిబాబు.

“కిల్లారి కిత్తి అంటే ఏంటి సార్”

“అది నువ్వడకకూడదు నేను చెప్పకూడదు. అయినా వేరే వాళ్ళ విషయాల్లో తల దూరుస్తావేం. ముందు నీ విషయం చూస్కో టింగాల టిస్కీ!” అన్నాడు ఏకాంబరం సీరియస్‌గా.

“అంటే ఏంటి సార్?”

“అర్ధాలడక్కు. చెప్తే ఇక్కడ పొర్లి పొర్లి ఏడుస్తావ్. ఆఫీస్ అట్మాస్ఫియర్ పాడై పోతుంది.”

అంతలో హెడ్‌క్లర్క్ సదాశివం లోపలికొచ్చి ఓ ఫైలు తెచ్చి ఏకాంబరం ముందు పెట్టాడు.

ఫైలు మీద నోటింగ్ చదివిన ఏకాంబరం సదాశివంతో “డింగాల డిప్పి” అన్నాడు.

“ఏంటి సార్..నేను రాసిన నోటింగ్ బాగాలేదా?” భయం భయంగా అడిగాడు సదాశివం.

ఏకాంబరం పకపకా నవ్వాడు.

“బాగుందయ్యా బాబూ... బ్రహ్మాండంగా రాసావ్. అందుకనే డింగాల డిప్పి అని నిన్ను పొగిడాను” అన్నాడు కులాసాగా కాళ్లూగిస్తూ.

“డింగాల డిప్పి అంటే ఏంటి సార్?” సంతోషంగా అడిగాడు సదాశివం

“అర్ధాలడక్కు.  వెళ్ళి నీ పని చూస్కో” అంతలోనే సీరియస్‌గా మొహం పెడ్తూ అన్నాడు ఏకాంబరం .

మేనేజర్ అర్ధంకాని పదమైనా తనని డింగాల డిప్పి అని పొగిడినందుకు సంతోషంగా క్యాబిన్ బయటకి వెళ్ళిపోయాడు. ఏకాంబరం బుచ్చిబాబు వంక తిరిగాడు.

“ఇందాకట్నుండీ చూస్తున్నా..అసలు నువ్వెందుకొచ్చావో చెప్పవేం?”  అడిగాడు.

“అంటే నేను ఇందాకే చెప్దామనుకున్నానుగానీ ఇంతలోనే మీరు వాళ్ళని విచిత్ర తిట్లతోనూ, పొగడ్తలతోనూ ముంచెత్తుతుంటే సిల్లీగా వింటూ వున్నా సార్!” అన్నాడు బుచ్చిబాబు వినయంగా.

“సరే ఏం పని మీదొచ్చావో చెప్పు”

“నాకు త్వరగా వెళ్ళడానికి పర్మిషన్ కావాలి సార్”

“వీల్లేదు...వీల్లేదుగాక వీల్లేదు!”

“సార్...మా నాయనమ్మకి ఒంట్లో బాలేదు సార్...ఆమెని హాస్పిటల్‌కి తీస్కెళ్ళాలి!” దీనంగా మొహం పెట్టి అన్నాడు బుచ్చిబాబు.

“నిజమేనా?” అనుమానంగా చూస్తూ ప్రశ్నించాడు ఏకాంబరం .

“నిజమే సార్! మా నాయనమ్మ మీద ఒట్టు! మా నాయనమ్మంటే నాకు చాలా ఇష్టం సార్.....నే చెప్పేది అబద్ధం అయితే నా నాయనమ్మ మీద సిల్లీగా ఒట్టేస్తానా సార్?”బుచ్చిబాబు గొంతు జీరపోయింది.

“సరే....సరే...నువ్వెళ్ళు....కానీ ఎప్పుడైనా అర్జంటు పని వుండి కాస్త ఆలస్యంగా కూర్చోమంటే అప్పుడు మొహం మాడ్చుకోకూడదు”.

“అలాగే సార్!” అంటూ బుచ్చిబాబు అక్కడే నిలబడి వున్నాడు.

“ఇంకా వున్నావేం?” అడిగాడు ఏకాంబరం .

“చిన్న డౌట్ సార్”

“మీకు కోపం వస్తే కిల్లారి కిత్తి, టింగల టిస్కి లాంటి విచిత్ర మైన పేర్లతో ఎందుకు తిడ్తారు సార్? మామూలుగానే అందరికి అర్థం అయ్యే భాషలోనే తిట్టొచ్చుగా?”

“అలా తిడ్తే అఫీస్‌స్టాఫ్ మొత్తం నాచెమ్డా లెక్కదీస్తారు. అర్థం కాని భాషలో తిడ్తే నేను సేఫ్”

“పోనీ పొగడ్తలయినా అర్థం అయ్యే భాషలో పొగడొచ్చు కద్సార్...విని మేం సంతోషిస్తాం కదా. అవి కూడా మాకు అర్థం కాని భాషలోనే అంటారు”.

“అర్థం అయ్యే భాషలో పొగిడ్తే హమ్మో..... నేనింతటి వాడ్నా అనుకుని కళ్ళు నెత్తిమీది కొచ్చేస్తాయి. అలా కళ్లు నెత్తిమీదకొచ్చేస్తే తర్వాత సరిగ్గా పని చేయరు డస్కు డమల్ నాయాళ్ళు! అంటే ఏంటని ఆడక్కు. అన్నట్లు నీ నాయనమ్మకు ఒంట్లో బాగోలేదని తీరుబడిగా కబుర్లేస్కున్నావేం?”

బుచ్చిబాబు నాలుక కర్చుకున్నాడు.

“సారీ సార్... నేనిక వస్తాను సార్”

“ఊ...ఊ ” గంభీరంగా బుర్రకాయ్ ఊగించాడు ఏకాంబరం .

బుచ్చిబాబు క్యాబిన్‌లోంచి బయటకు వచ్చాడు.

అక్కడ హాల్లో ఇందాక ఏకాంబరం చేత ‘కిల్లారి కిత్తి’ అని తిట్టించుకున్న లత వెక్కివెక్కి ఏడుస్తుండడం, నలుగురైదుగురు స్టాఫ్ మెంబర్లు ఆమెని ఊరడించడానికి ప్రయత్నించడం బుచ్చిబాబుకి కనిపించింది.

0 0 0

సీత పగలబడి నవ్వింది.

బుచ్చిబాబు ఆమెవంక తన్మయత్వంతో చూశాడు.

“అయితే మీ మేనేజర్ని అలా బురిడీ కొట్టించావన్న మాట! త్వరగా వెళ్తానని అన్నందుకు అతను నిన్ను వింత వింత తిట్లేమీ తిట్టలేదు కదా?” అడిగింది సీత నవ్వాపుకుంటూ.

“బురిడీ కొట్టించిన తర్వాత ఇంకా తిట్లెందుకు తిడ్తాడు. హయ్యయ్యో.. పాపం మీ నాయనమ్మకి బాలేదా వెళ్లిపో వెళ్ళిపో అన్నాడు” సీత చేతిని తన చేతిలోకి తీస్కుంటు అన్నాడు బుచ్చిబాబు .

“థియటర్ వచ్చేసింది” అంటూ అతని చేతిలోంచి తన చెయ్యి లాగేస్కుంది సీత.

ఆటో థియేటర్ ముందు ఆగింది.  ఇద్దరు ఆటో దిగారు. బుచ్చిబాబు ఆటో డబ్బులు చెల్లించాక ఇద్దరూ థియేటర్ కాంపౌండ్‌లోకి అడుగు పెట్టారు. సీత తలెత్తి చూసింది.

సినిమాకి సంబంధించిన పెద్దపెద్ద కటౌట్‌లు. సినిమా పేరు ‘పెళ్ళాం పిచ్చిది--ప్రేయసి చచ్చుది’.

“సినిమా టైటిల్ చూస్తే ఇలాగుంది. ఏమైనా బాగుంటుందంటావా?” సందేహంగా అడిగింది సీత.

“జనం ఫర్వాలేదని అంటున్నారు. అయినా ఈ మధ్య అన్ని సినిమాలకి ఇలాంటి టైటిల్స్ వుంటున్నాయి. పోనీ ప్రక్క థియేటర్‌లో ‘మా నాన్నే మీ అమ్మకి మొగుడు’ సినిమా ఆడ్తుంది. దానికి వెళ్దామా?” అడిగాడు బుచ్చిబాబు.

“వద్దులే ...దానికంటే ఇదే నయం అనుకుంటా. అవునుగాని ఆ హీరో కటౌట్‌కి అంతంత దండలు ఎవరేస్తారు? థియేటర్ వాళ్ళా, ఈ సినిమా తీసినవాళ్ళా?”

“ఇద్దరూ కాదు. ఆ దండలు వేసింది హీరో అభిమానులు. ఈ హీరోకి వీరాభిమానులు వున్నారు కదా!” అన్నాడు బుచ్చిబాబు.

ఇద్దరూ  టికెట్స్ కౌంటర్ దగ్గరికి వెళ్ళారు. బుచ్చిబాబు అటూఇటూ ఓసారి పరికించి చూసాడు “ఏంటి?” అడిగింది సీత.

“నాకు తెల్సినవాళ్ళెవరైనా వచ్చారేమోనని” మెల్లగా అంటూ టికెట్స్ తీసుకున్నాడు బుచ్చిబాబు.

సీత బుచ్చిబాబు వంక చిరాకుగా చూసింది.

“అంత భయపడేవాడివి నన్ను సినిమాకెందుకు తీసుకొచ్చావ్?” అంది.

బుచ్చిబాబు ఎంట్రెన్స్ వైపు అడుగులు వేశాడు.

“ఇలా దొంగ దొంగగా తిరగడం నాకేం నచ్చడంలేదు. హాస్టల్‌కి లేటుగా వెళ్లినప్పుడు